ఉద్యోగులకు కష్టాల యోగం.!

- యోగాంధ్ర పేరుతో పనిఒత్తిడి పెంచిన ప్రభుత్వం
- ఓటీపీలతో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పడంతో ఉద్యోగులకు ఇక్కట్లు
- ఓటీపీలు ఎందుకు చెప్పాలంటున్న ప్రజలు
- యోగాలో పాల్గొనని వారి పేర్ల మీద సైతం రిజిస్ట్రేషన్ అయినట్లు స్కానర్ పంపిస్తున్న వైనం


సంతనూతలపాడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో యోగాపై శిక్షణ ఇస్తున్న అధికారులు (ఫైల్)

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం అధికారులు, ఉద్యోగులను తీవ్ర పనిఒత్తిడికి గురిచేస్తోంది. మే 21న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలో ఐదు లక్షల మందితో ఘనంగా యోగా నిర్వహించాలన్న లక్ష్యంతో కొనసాగుతోంది. అయితే దీనివలన స్థానిక సిబ్బంది మానసికంగా, శారీరకంగా తీవ్రంగా నలిగిపోతున్నారు. గ్రామ సెక్రటరీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, యోగా మాస్టర్ ట్రైనర్లు ఇలా ప్రతి ఉద్యోగిపై కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు, శిక్షణ కార్యక్రమాలు, పోటీల నిర్వహణ బాధ్యతలు వేయడంతో పనిభారం విపరీతంగా పెరిగింది. కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటంతో అధికారులను ముప్పతిప్పలు పెడుతోంది. ప్రతి పనికి సర్వేల పేరుతో ఇటు సచివాలయ సిబ్బందిని, అటు ప్రజలను ఏదోక రకంగా ఇబ్బంది పెడుతున్నారు. పీ4, గృహాలకు ఆధార్ నమోదు.. ఇలా నిత్యం ఏదో ఒక సర్వే పేరుతో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఇవన్నీ చాలదన్నట్లు ఇప్పుడు యోగా పేరుతో ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి యోగా డే రోజున ప్రజలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో అన్ని శాఖల అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సంతనూతలపాడు మండలంలోని 15 సచివాలయాల్లో ఇప్పటి వరకు వేల మంది పేర్లను యోగాంధ్ర యాప్లో నమోదు చేశారు. యోగాలో పాల్గొనని వారి పేర్ల మీద సైతం రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం.

యాప్‌లతో ఉద్యోగులకు ఇక్కట్లు...

పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో పాటు అన్ని శాఖల అధికారులు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి యోగాలో పాల్గొనే వారి వివరాలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వివిధ శాఖ ఉద్యోగులు వారి పరిధిలో ఉన్న వారి ఆధార్ వివరాలు యాప్లో నమోదు చేసి ఓటీపీని అందులో నమోదు చేస్తున్నారు. ఇంతవరకు ఓకే.. కానీ వారు యోగాకు రామని చెప్పినా యాప్లో వివరాలు పొందుపరుస్తున్నారు. అందులో నో ఆప్షన్ పెట్టినా మొబైల్ నంబర్, ఓటీపీ నమోదు చేయాల్సి వస్తోంది. ఈ ప్రక్రియలో వారి ఫోన్‌కు వచ్చిన ఓటీపీ కోసం అడుగుతుంటే ఎందుకివ్వాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఉద్యోగులున్నారు.

తీవ్రస్థాయిలో పని ఒత్తిడి...

యోగాంధ్ర పేరిట ప్రభుత్వం చేస్తున్న హంగామా అధికారులు, ఉద్యోగులను అయోమయానికి, అవస్థలకు గురిచేస్తోంది. మండల స్థాయి అధికారులు, గ్రామ సెక్రటరీలు, సచివాయల ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, యోగాంధ్ర మాస్టర్ ట్రైనీలు ఇలా అందరిపై ఒత్తిడి పెరిగింది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్లు, ఆసనాల శిక్షణను ఎట్టకేలకు అధికారులు పూర్తి చేశారు. యోగాంధ్ర యాప్ రిజిస్ట్రేషన్లు, గ్రామ, మండల స్థాయి పోటీల నిర్వహణ వరకు ఎంపీడీఓలు, తహసీల్దార్లకు లక్ష్యాలు నిర్ణయించారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఈ లక్ష్యాలను ఎలా చేరుకోగలమంటూ అధికారులు ప్రశ్నిస్తున్నారు. వీటితో పాటు నేడు యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఆదేశించడం మరింత ఇక్కట్ల పాలు చేసినట్లయింది. ప్రజలు రాకపోతే తామేం చేయగలమని అధికారులు, ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, అధికారిక పనులతో సతమతమవుతుంటే.. ఇలాంటి అదనపు పనులతో తాము ఒత్తిడికి లోనవుతున్నామని వారు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

- చీమకుర్తి మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు కోరారు. ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ జేష్ఠ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిడతలపూడి–రామచంద్రాపురం రహదారిపై అధిక టన్నేజీతో లారీలు తిరగడం వలన ఆ రహదారి గోతులమయంగా తయారైందని తెలిపారు. ప్రజలు ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారిని నూతనంగా పునర్నిర్మించాలన్నారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆ రహదారికి మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తామన్నారు. కేవీ పాలెం గ్రామానికి రక్షిత మంచినీటిని త్వరగా అందించడానికి మువ్వావారిపాలెంలో నిర్మిస్తున్న సంపు పనులు, పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పలు గ్రామాల్లో నాయకుల సూచనల మేరకు తాగునీటి బోరింగులు వేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈని ఆదేశించారు. జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 90 శాతం పూర్తయిన పనులను మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధుల ద్వారా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య, చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మండవ అప్పారావుకు పరామర్శ


మండవ అప్పారావును పరామర్శిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి


బంగారుబాబును పరామర్శిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు కొన్ని నెలల క్రితం ప్రమాదానికి గురై కాలికి దెబ్బతగిలి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఆయనను పార్టీ ఒంగోలు పార్లమెంటరీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీకి పూర్తి స్థాయిలో పనిచేయాలని ఆకాంక్షించారు. పార్టీ నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

బంగారుబాబుకు పరామర్శ...

నాగులుప్పలపాడు: మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు మారెళ్ల బంగారుబాబును ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. కొన్నిరోజుల క్రితం బంగారుబాబు కాలికి గాయం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనను నాయకులు కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


వైభవంగా శ్రీనివాసుని కళ్యాణం


వెంకటేశ్వరస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక కమ్మపాలెం లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మండలాభిషేక పూజలు పూర్తయిన సందర్భంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. దేవస్థాన ఆవరణలో చూడచక్కని కళ్యాణ వేదికను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని కొలువుదీర్చి భక్తుల హర్షధ్వానాల నడుమ కళ్యాణం జరిపించారు. నేత్రోత్సవంగా స్వామివారి కళ్యాణం సాగింది. అర్చకులు కళ్యాణ్ చక్రవర్తి ఋత్విక బృందం ముందుగా దేవేరులను కంకణధారులను చేసి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. అభిజిత్ శుభ ముహూర్త లగ్నంలో స్వామివారు, అమ్మవార్లకు జీలకర్ర బెల్లం పెట్టి కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ, మాల మార్పిడిని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. అనంతరం పుష్పార్చన జరిపించి స్వామివారి కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త అల్బూరి చంద్రమౌళి విజయలక్ష్మీ దంపతులు, రవిచంద్ర, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


కళ్యాణ వేదికపై లక్ష్మీపద్మావతీ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక సమతానగర్‌లోని మహాగణపతి రాజ్యలక్ష్మి సహిత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం లక్ష్మీపద్మావతీ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని ఆగమ ప్రవర్త శ్రీ మదష్టాక్షరీ సుదర్శన హనుమాన్ ఉపాసకుడు పంచశతాధిక ప్రతిష్టాపనచార్య పండిత్ పరాంకుశం కేశవాచార్యులు వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణ క్రతువులో పది మంది దంపతులు పాల్గొన్నారు.

కేంద్రం చేతుల్లోకి విద్యారంగం


జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

- కాషాయీకరణ, కార్పొరేట్ విధానాన్ని సంతరించుకున్న వైనం
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి

చీమకుర్తి: ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగం ప్రస్తుతం కేంద్రం చేతుల్లోకి వెళ్లిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి అన్నారు. శుక్రవారం చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు కేరళలో జరగనున్న అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ మహాసభల సందర్భంగా చీమకుర్తిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ దేశంలోని విద్యావిధానం కాషాయీకరణ, కార్పొరేటీకరణ సంతరించుకుందని, సామాన్య విద్యార్థికి చదువు అందని ద్రాక్షలా మారిందని తెలిపారు. విదేశీ యూనివర్శిటీల రూపంలో మెకాలే విద్యావిధానానికి ఆహ్వానం పలుకుతున్నారన్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ మహాసభలకు విదేశాల నుంచి కూడా విద్యార్థి సంఘాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా నుంచి ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎక్కువ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధులు వినోద్, దేవరాజు, విజయ్, పాండురంగారావు, నాగుల్ మీరా, స్థానికులు పాల్గొన్నారు.

వాహన చట్టం అతిక్రమిస్తే కఠిన చర్యలు


ఆటోలను తనిఖీ చేస్తున్న అధికారులు

మార్కాపురం టౌన్: ఆటో డ్రైవర్లు వాహనాల చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు, ఒంగోలు ఎంవీఐ హెచ్చరించారు. శుక్రవారం మార్కాపురం సమీపంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఆటోలను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోవాలాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మొత్తం 18 ఆటోలను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి 1.49 లక్షల రూపాయలు జరిమానా విధించారు. 4 ఆటోలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

యోగాతో ఒత్తిడిని జయించాలి


సూర్యనమస్కారం చేస్తున్న నాయకులు


సీవీఎన్ రీడింగ్ రూంలో యోగా చేస్తున్న క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: యోగాతో ఒత్తిడిని జయించాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు చుండూరి నళిని, గుర్రం సత్యనారాయణ సూచించారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో క్లబ్ సభ్యులకు యోగాపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సభ్యులచే కొన్ని వ్యాయామాలు, శ్వాస ప్రక్రియలు, ధ్యానం చేయించారు. క్లబ్ అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథరావు, కార్యదర్శి కోడూరి రాధాకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ రామిరెడ్డి నితిన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ తోట సాయినవీన్, ట్రెజరర్ ఆరిగ వీరప్రతాప్, కార్యవర్గ సభ్యులు తోట శ్రీధర్‌బాబు, చక్క రామకృష్ణారావు, కరేటి కిరణ్‌బాబు, జల్లిపల్లి పూర్ణచంద్రరావు, యమాల బాలకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి మనిషి జీవితంలో యోగా భాగం కావాలి

నాగులుప్పలపాడు: యోగా వలన మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం లభిస్తాయని బీజేపీ మండల అధ్యక్షురాలు పొద అపర్ణ అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని రాపర్ల, మెట్టువారిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న 300 మంది కార్మికులకు యోగాంధ్ర–2025 ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో టీగ్రా, పెంట్యాల శ్రీనివాసరావు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ కొలుపులు ప్రారంభం


ప్రజలను ఆకర్షించిన బొల్లావుల నృత్యం

కురిచేడు: కురిచేడులో నుసుం ఇంటిపేరు ఉన్న వారు తమ ఇలవేల్పు ఎల్లమ్మ తల్లికి కొలుపులు శుక్రవారం నుంచి ప్రారంభించారు. 30 సంవత్సరాల తర్వాత కొలుపులు ప్రారంభించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి గుండ్లకమ్మ నది వద్దకు వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి గ్రామోత్సవంగా గ్రామంలోకి వచ్చారు. బొల్లావుల నృత్య ప్రదర్శన చూపరులను ఆకర్షించింది. కురిచేడులో కొలుపులు చాలాకాలం తర్వాత జరుగుతుండటంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.


ఎల్లమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

బాధితునికి సెల్‌ఫోన్ అందజేత


బాధితునికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ త్యాగరాజు

దొనకొండ: పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్ కనుగొని బాధితునికి అప్పగించింది. ఎస్ఐ టి.త్యాగరాజు కథనం ప్రకారం.. మండలంలోని ఆరవల్లిపాడు గ్రామానికి చెందిన గుమ్మా బాలకాశయ్య కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ తాగ్యరాజు ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పోయిన సెల్‌ఫోన్ కనుగొని బాధితునికి శుక్రవారం అందజేశారు. బాధితుడు పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అర్ధవీడు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 6, 7, 8, 9వ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు దర్శి గురుకులంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష రాసి పాఠశాలలో ఇంకా చేరని విద్యార్థులకు ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9000660581ను సంప్రదించాలని సూచించారు.

నేడు సీఐటీయూ మండల మహాసభ

బేస్తవారిపేట: స్థానిక కందుల ఓబుల్‌రెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు సీఐటీయూ మండల మహాసభ నిర్వహిస్తున్నట్లు సంఘ కంభం మండల కార్యదర్శి షేక్ అన్వర్‌బాషా తెలిపారు. మండల నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా కార్యదర్శి కె.సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాసభలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

ప్రైవేట్ స్కూళ్ల బస్సులు నిబంధనలు పాటించాలి

కంభం: ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తూ బస్సులు నడపాలని సీఐ కె.మల్లిఖార్జున, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు సూచించారు. కంభం పట్టణంలో ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లు, యాజమాన్యంతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూల్ బస్సులను పరిశీలించారు. బస్సులు కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలని, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదన్నారు. కాలం చెల్లిన బస్సులను విద్యార్థుల రవాణా కోసం వినియోగించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి బస్సులు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డ్రైవర్లు, క్లీనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

క్లుప్తంగా

నేడు అభయాంజనేయస్వామి కళ్యాణం

ఒంగోలు సిటీ: ఒంగోలు రూరల్ మండల పరిధిలోని కరవది గ్రామంలో శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ నిర్వాహక సంఘ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనము, హనుమత్ కలశ స్థాపన, పంచసూక్తము, పంచామృతాభిషేకం, 9 గంటల నుంచి హనుమత్ సుదర్శన హోమం, 10 గంటల నుంచి శ్రీ సువర్చల హనుమత్ కళ్యాణం, మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు శ్రీ అభయాంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఎల్పీఎంలు సరిచేసుకోవాలి

నాగులుప్పలపాడు: మండలంలో భూముల రీ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో జాయింట్ ఎల్పీఎం నంబర్ల కారణంగా చాలా మంది మహిళలు తల్లికి వందనం పథకానికి లబ్ధి కోల్పోతున్నారని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎక్కువ భూమి ఉన్నట్లు చూపిస్తున్నందున జాయింట్ ఎల్పీఎం నంబర్లు ఉన్న వారు ఈ నెల 30వ తేదీలోపు హక్కు పత్రాలు తెచ్చుకుని సింగిల్ ఎల్పీఎం నంబర్‌ను సబ్ డివిజన్లో నమోదు చేయించుకోవాలని చెప్పారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా మీరున్నీసా బేగం


ప్రిన్సిపాల్ మీరున్నీసాబేగం

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి ప్రిన్సిపాల్‌గా మీరున్నీసాబేగం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా రంగాపురం కేజీబీవీ నుంచి బదిలీపై ఆమె వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో బైపీసీ గ్రూపునకు 12 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో 913 అత్యధిక మార్కులు సాధించడం జరిగిందన్నారు. తీర ప్రాంతంలో విద్యార్థినులు చదువుకోవడానికి చెట్లతో చల్లటి వాతావరణం, ఐదు ఎకరాల గ్రౌండ్ ఎంతో బాగుందన్నారు. మంచి ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హామీలు విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

ముండ్లమూరు (కురిచేడు): రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికల ముందు నెలకు రూ.25 వేల ఆదాయంలోపు ఉండే వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రకటించి ప్రభుత్వం ఏర్పడ్డాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం ముండ్లమూరు మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మండిపడ్డారు. నిరుద్యోగులుగా ఉన్న యువతీ, యువకులకు బ్యాంకుతో సంబంధం లేని రుణాలు ఇచ్చి స్కిల్‌తో కూడిన శిక్షణ ఇచ్చి అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓలో పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పినా ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. అతి తక్కువ ఆదాయాలు వస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, స్కీమ్ వర్కర్లకు, మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో వారికి సంక్షేమ పథకాలు అమలు చేయటం లేదని పేర్కొన్నారు. కేవలం సీఎఫ్ఎంఎస్ వేతనాలు తీసుకున్నంత మాత్రాన వారు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వీరిలో ఎక్కువ మంది దళిత గిరిజన బలహీన వర్గాలకు చెందిన వారు ఉన్నారన్నారు. అనేక మంది రూ.10 వేల కన్నా తక్కువ వేతనం వచ్చే వారేనని ఆయన గుర్తు చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.25 వేల ఆదాయం వస్తున్నా, అంగన్‌వాడీలకు రూ.11,500, హెల్పర్లకు రూ.7 వేలు, ఆశాలకు రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. తల్లికి వందనం నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

దేవరాజుగట్టులో పడకేసిన పారిశుధ్యం

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు ఫ్లయి ఓవర్ బిడ్జి పక్కన పారిశుధ్యం పడకేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఊదరగొట్టే స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో తూతూ మంత్రంగా బ్యానర్లు చేతబట్టి ర్యాలీలు చేయడం మినహా పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అలంకార ప్రాయంగా కనిస్తున్నాయి. పారిశుధ్య కార్మికులు ఉన్నా రోడ్ల వెంట ఉన్న చెత్త కుప్పలను సకాలంలో తొలగించలేకపోతున్నారు. కంభం వెళ్లే రహదారి పక్కన రోజుల తరబడి చెత్త తొలగించక పోవడంతో కుప్పలుగా పెరుకుపోతోంది. రహదారిలో పేరుకుపోయిన చెత్త స్వాగతం పలుతోంది. రోజుల తరబడి చెత్తను తొలగించక పోవడంతో వర్షాలకు కుళ్లి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతున్న చెత్త కుప్ప రోగాల బారిన పడతామేమోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రహదారి వెప్పు ముక్కుమూసుకొని వెళ్తున్నామని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చెత్త కుప్పను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.